www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 25 | జూన్ | 2025

పేజీలు : 8

## రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలి



-భూ నిర్వాసితులతో చర్చలు జరపాలి

-మున్నేరు రిటైనింగ్ వాల్ పనుల పురోగతి, నిర్వాసితులకు ఇవ్వనున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

2 లో

# ప్రక్షాళన షురూ..!







### -అసిస్టెంట్ కమిషనర్ బదిలీ
### -ఇకనైనా పాలన గాడిన పడేనా

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం కార్పోరేషన్‌లో పాలన గాడి తప్పింది. ఇందుకు ప్రధాన కారణం అధికార యంత్రాంగమైతే మరో కారణం సమన్వయ లోపం. ఈ రెండింటి కారణంగా ఎన్నడులేనంతగా పాలనపై విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలు సైతం అధికారుల మధ్య బేధాభిప్రాయాలు, సమన్వయ లోపంతోనే మీడియాకు లీకులు ఇచ్చారన్న ప్రచారం లేక పోలేదు. మొత్తంగా కార్పోరేషన్‌లో ఇద్దరు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఒకరు అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా కాగా మరొకరు ఇంజనీరింగ్ అధికారి. వీరిద్దరు కార్పోరేషన్ సిబ్బందిని తమకు అనుకూలంగా మలచుకోవడంతో పాటు తమకు అనుకూలమైన వారి పట్ల ఒకవిధంగా లేని వారి పట్ల మరో విధంగా వ్యవహరించడంతో సమస్య తలెత్తింది. ఇప్పుడు ప్రభుత్వం ఎట్టకేలకు షఫీవుల్లాను గ్రేటర్

మిగతా 2లో..

## అపరిశుభ్రంగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి

-జీతాల రాక కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

-నానా అవస్థలు పడుతున్న రోగులు, వైద్యులు

-ప్రజాపక్షం/వైద్యవిభాగం



సెంటర్‌స్ప్రెడ్

## ఆశగా ఆకాశం వైపు..!

- ముఖం చాటేసిన రుతువు
- వానల కోసం రైతన్నల ఎదురుచూపు

దుక్కులు దున్ని సిద్ధం చేసిన రైతులు

- జిల్లాలో లోటు వర్షపాతం నమోదు

2 లో



-ప్రజాపక్షం/భద్రాచలం

## దేశాల మధ్య చిచ్చుపెడుతున్న అమెరికా




-యుద్దాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతి నెలకొల్పాలి

-వామపక్షాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో నిరసన

-ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్

2 లో

## డొనాల్డ్ ట్రంప్ యుద్ధ పిపాసి

-అమెరికా యుద్ధ కాంక్ష వల్లనే ప్రపంచంలో అశాంతి

-ఖమ్మంలో వామపక్షాల నిరసన

-ప్రజాపక్షం/ఖమ్మం



# ప్రక్షాళన షురూ..!

**(మొదటిపేజీ తరువాయి)**
హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. మరో ఇంజనీరింగ్ అధికారిని కూడా బదిలీ చేస్తే అధికారుల పరంగా కొంత మేర ప్రక్షాళన జరిగినట్లే. అధికార యంత్రాంగాన్ని గాడిన పెడితే పాలన కూడా గాడిన పడుతుంది. అధిక ఆదాయం ఉండి పనులు చేయకపోవడం ప్రజల్లో కార్పొరేషన్ పాలన పట్ల వ్యతిరేక భావం ఏర్పడుతుంది. పాలక వర్గంపై అవినీతి ఆరోపణలు లేకపోయినా అధికారులను సమన్వయం చేయడంలో వైఫల్యం చెందారన్న విమర్శను ఎదుర్కొనక తప్పలేదు. పాలక వర్గ తీర్మానాలకు వ్యతిరేకంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుందన్న కార్పొరేటర్ల విమర్శకు సమాధానం చెప్పలేని పరిస్థితి. కార్పొరేటర్లకు సంబంధం లేకుండానే ఆయా డివిజన్లలో పనులు జరుగుతున్నాయి. కానీ కార్పొరేటర్ల ప్రతిపాదించిన పనులు కాకుండా వేరే పనులకు ప్రాధాన్యతనిస్తున్నారని తాము నిమిత్త మాత్రులుగా మారుతున్నామని కార్పొరేషన్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు ఆరోపించారు. ఇందుకు పలువురు పలు పనులను ఉదాహరించారు కూడా. అధికార యంత్రాంగంలో ఉన్న గ్రూపులు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ఇక కార్పొరేషన్ కమిషనర్ కింది స్థాయి అధికారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. ప్రధానమైన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం కూడా విమర్శలకు కారణమవుతుంది. ఉదాహరణకు గతంలో వీధి లైట్లు క్రమం తప్పకుండా మరమ్మతులు చేయడం లేదా కొత్తవి వేయడం చేసేవారు. కానీ ఇప్పుడు కార్పొరేటర్లు చెప్పిన వీధి లేట్లు వేయడం లేదని కాంట్రాక్టర్‌కు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం వల్లే ఇది జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సుమారు ఐదు లక్షల జనాభా కలిగిన ఖమ్మం కార్పొరేషన్ పాలన పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పాలక వర్గ తీర్మానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. కొందరు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని తమకు అనుకూలంగా నియమించుకుని వారి ద్వారా పలు అనుమతులు ఇప్పిస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలకు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనికి కూడా పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఏదైనా కమిషనర్, మేయర్ పై ఆరోపణలు లేకున్నా క్షేత్రస్థాయి సిబ్బంది తీరు విమర్శలకు తావిస్తున్న నేపథ్యంలో ఇటు పాలక వర్గం, అటు కమిషనర్ కూడా సొంత పెత్తనాలకు తెర లేపిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**మరింత ప్రక్షాళన జరగాలి : బిజి క్లెమెంట్**
ఖమ్మం కార్పొరేషన్‌లో పాలక వర్గం అధికార యంత్రాంగం మధ్య సమన్వయం ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి పనులు త్వరితగతిన జరుగుతాయని కార్పొరేషన్‌లో సిపిఐ పక్ష నాయకులు బిజి క్లెమెంట్ తెలిపారు. కార్పొరేషన్‌లో ఒకరిద్దరి అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రక్షాళన జరగాల్సి ఉంది. అందరి ఎజెండా సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజల వద్దకు కార్పొరేషన్ పాలనను తీసుకెళ్లడమేనని ఇందుకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని క్లెమెంట్ కోరారు.

# ఆశగా ఆకాశం వైపు..!

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏజెన్సీ జిల్లాగా ఉన్న భద్రాద్రి జిల్లాలో అటవీ గ్రామాలే ఎక్కువ. నీటి వనరులైన నదులు,వాగులు, వంకలతో పాటు ఆకాశవాయిపై ఆధారపడ్డ రైతులు కూడా ఎక్కువగానే ఉన్నారు. జూన్ మాసం ముగుస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలోవాలన పడకపోవడంతో రైతున్నలు వాన చినుకుల కోసం ఆశగా ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు.

**పత్తి, ఇతర పంటలు...**
జిలాల్లో వానా కాలం సీజన్లో పత్తి 2లక్షల 10 వేల ఎకరాల్లో సాగు చేస్తారనే అంచనాలతో వ్యవసాయశాఖ లెక్కలు కట్టింది. అదే విధంగా వరి 1 లక్ష 68 వేల ఎకరాలు, మర్చి 15 వేల ఎకరాలతో పాటు ఇతర పంటలు సాగు అంచనాలు ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు వర్షాలు ఆశించిన స్థాయిలో పడక పోవడంతో జిల్లా వ్యాప్తంగా కేవలం 1 లక్ష 60వేల ఎకరాల్లో మాత్రమే పత్తివిత్తనాలు విత్తారు. తడిపెట్టేందుకు వీలున్న పొలాల్లో రైతులు పంటను వేశారు. సాధారణ రకం పత్తికి రూ.7710, ఏగ్రేడ్ పత్తి రకానికి రూ.8110 లను కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంతో ఎక్కువ మంది రైతులు అంచనాలకు మించి పత్తి సాగుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**దుక్కులు దున్నుకుని...**
పత్తికి మద్దతు ధర పెరగడంతో రైతులు అటుగా మొగ్గు చూపుతున్నారు. దీంతో ఇప్పటికే దుక్కులు దున్నుకుని సాగుసు సమాయత్తం అయ్యారు. వాస్తవానికి దాదాపు పత్తిని విత్తాల్సి ఉండగా, ఇంకా 40 శాతానికి పైగా రైతులు పొలాల్లో అడుగు పెట్టలేదు. వర్షాలు అనుకున్నస్థాయిలో పడుంటే వ్యవసాయ శాఖ అంచనాలు కూడా



దాటిపోయేది. మరోప్రక్క వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేసుకునేందుకు కూడా రైతులు సిద్ధపడుతున్నారు.

**జిల్లాలో లోటు వర్షపాతం...**
జిల్లాలో జూన్ నెలలో ఇప్పటి వరకు లోటు వర్షపాతం నమోదైంది. వాస్తవానికి సాధారణంగా 130 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 65 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. సాగానికి సగం లోటు వర్షపాతముంది. గత ఏడాది ఇదే సీజన్లో సాధారణ వర్షాపాతం 164 మిల్లీ మీటర్లను మించి 213 మిల్లీ మీటర్లు పడింది. జిల్లాలో ప్రస్తుతం ఆకాశం మేఘా వృతమవుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురియడం లేదు. ఇదే పరిస్థితి మరికొద్దిరోజుల పాటు కొనసాగితే దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

# డోనాల్డ్ ట్రంప్ యుద్ధ పిపాసి

**ప్రజాపక్షం/ఖమ్మం :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ పిపాసి అని ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ ఇరాన్‌పై దాడికి తెగబడ్డాడని వామపక్షాల నేతలు ఆరోపించారు. కేవలం ఆయుధ వ్యాపారం కోసమే అమెరికా ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తుందని అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ పోలీసులా వ్యవహరించాలని ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. మంగళవారం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు సిపిఐ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నేతలు మాట్లాడుతూ ఇరాన్‌పై అమానుషంగా దాడి చేస్తుందని గాజాపై ఇజ్రాయిల్ దాడిని సమర్థించడమే కాకుండా స్వయంగా ఇరాన్‌పై దాడికి పాల్పడడం సామ్రాజ్యవాద కాంక్షలో భాగమేనన్నారు. ప్రపంచ శాంతికి అమెరికా భంగం కలిగిస్తున్న భారత ప్రధాని మోదీ మౌనంగా ఉండటం పరోక్షంగా ట్రంప్‌ను సమర్థించడమేనన్నారు. గాజాలో మహిళలు, పసిపిల్లలు అని చూడకుండా ఇజ్రాయిల్ వరుస దాడులు చేస్తుందని దీనిపైన భారత్ తన వైఖరిని స్పష్టం చేయలేదని వారు దుయ్యబట్టారు. ప్రపంచంలో అశాంతి నెలకొనడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడనున్నారని వారు తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను లెక్కచేయకుండా ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్న అమెరికా వైఖరిని యావత్ ప్రపంచం ఖండించాలని వారు విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియా దేశాలపై ఆధారపడిన భారత్ లాంటి దేశాలకు ఇబ్బంది కలగనుందని వారు తెలిపారు. భారత్ అలీన విధానాన్ని కాదని అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విధానాన్ని పాటిస్తుందని దీనిని విడనాడి యుద్ధాన్ని ఆపడానికి భారత్ ప్రయత్నించాలని వామపక్షాల నేతలు కోరారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు బాగం హేమంతరావు, దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, ఝాన్సీ, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, వై. విక్రం, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, యర్రా శ్రీను, రావి శివరామకృష్ణ, మంగతాయి, పగడాల మల్లేష్, మేకల శ్రీను, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

# రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మున్నేరు నదికి ఇరువైపులా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతి, భూ నిర్వాసితులకు పోలేపల్లి వద్ద కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిటైనింగ్ వాల్, డ్రైన్, రోడ్డు నిర్మాణాలు, పరిహార భూమి అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎర్త్ వర్క్ 41 శాతానికి పైగా, సిమెంట్, కాంక్రీట్ పనులు 32 శాతం పూర్తయినట్లు , నగరం నుండి వివిధ డ్రైన్ల నుంచి వచ్చే వరద నీరు నిర్వహణ గురించి, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి చర్యల గురించి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నదికి ఇరువైపులా ఎనిమిదిన్నర కిలో మీటర్ల చొప్పున మొత్తం 17 కిలో మీటర్లు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని దీని కోసం 138 ఎకరాల పట్టాభూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ భూమి, అభ్యంతరాలు లేని చోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. పోలేపల్లి రెవెన్యూ గ్రామంలో అందుబాటులో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు 300 ఎకరాల ప్రభుత్వ భూమిని అన్ని విధాల అభివృద్ధి చేసి భూ నిర్వాసితులకు పరిహారంగా అందించేలా ఒప్పించాలని కలెక్టర్ తెలిపారు. పరిహారంగా ఇవ్వనున్న భూమిని చదును చేసి ప్లాట్లుగా విభజించి రోడ్లు, ప్రభుత్వ పరంగా అన్ని సదుపాయాలు కల్పించి భూ విలువ గురించి నిర్వాసితులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు 70 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి పట్టాదారులు ఒప్పుకున్నట్లు తెలిపారు. మిగిలిన వారితో చర్చలు జరిపి ఒప్పించాలని కలెక్టర్ తెలిపారు. మున్నేరు వరదలతో నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్నేరు వరదలకు పైనుంచి వచ్చే ఆకేరు తదితర నీటి మట్టాలను ప్రవాహ ఉధృతులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. జిల్లాలో జలాశయాలు, నదుల నీటిమట్టాలపై ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని, ప్రమాద స్థాయిని ముందస్తుగానే సమాచారం ఇచ్చినచో ప్రభావిత ప్రాంతాల ప్రజల తరలింపు ప్రక్రియతో నష్టం జరగకుండా తగు చర్యలు చేపట్టవచ్చునన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ దిశగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, ఇరిగేషన్ డిఈ రమేష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# దేశాల మధ్య చిచ్చుపెడుతున్న అమెరికా

**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశాల మధ్య చిచ్చుపెడుతూ యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాడని వామపక్ష పార్టీల జిల్లా నేతలు ఆరోపించారు. అఖిలభారత వామపక్ష పార్టీల దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి సిపిఎం కార్యాలయం మీదుగా బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇరాన్ దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి అమెరికా ప్రోత్సహించడమే కాకుండా ఆ దేశంపై స్వయంగా బాంబుదాడులకు పూనుకుందని ఇది అంతర్జాతీయ చట్టాలను ఛేఖాతరు చేస్తూ ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా అమెరికా పోకడలు ఉన్నాయన్నారు. తక్షణమే యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, ప్రపంచదేశాలపై అమెరికా కర్రపెత్తనాన్ని కండించాలని నాయకులు పిలుపునిచ్చారు. అమెరికా తీరుపై ప్రధాని మోదీ నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని, అమెరికాతో చేయికలిపి యుద్ధాలను మోదీ ప్రోత్సహిస్తున్నాడా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నేరెళ్ల రమేష్, బోయిన విజయకుమార్, పి.సత్యనారాయణాచారి, ధర్మరాజు, గుత్తుల శ్రీనివాస్, మూడ్ గణేష్, షాహీన్, షమీమ్, శాంతి, సిపిఎం జిల్లా నాయకులు లిక్కి బాలరాజు, లక్ష్మి, సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ జాటోతు కృష్ణ, ఉమర్, గౌని నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఘర్షణ

**-కత్తితో దాడి పరిస్థితి విషమం**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం నగరంలోని మమత మెడికల్ కళాశాల రోడ్డు వద్ద గల ఓ మద్యం దుకాణంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఇందిరా నగర్ కాలనీకి చెందిన మనీష్ అనే వ్యక్తి స్థానికంగా కొంత మందితో కలిసి సదరు మద్యం షాపు వద్ద మంగళవారం ఉదయం ఘర్షణకు దిగాడు. ఈ





క్రమంలో అక్కడే ఉన్న శ్రీలక్ష్మి నగర్ కాలనీకి చెందిన మేడిరాజు వెంకటేశ్వర్లు అనే సుతారీ మేస్త్రికి మనీష్‌కు మధ్య వివాదం చోటు చేసుకుంది.అక్కడి వారు, షాపు యజమాని సర్దిచెప్పి వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఇదిలా ఉండగా సాయంత్రం అదే మద్యం షాపు వద్దకు మనీష్ రాగా అప్పటికే అక్కడ ఉన్న వెంకటేశ్వర్లు మనీష్‌పై వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి గొంతు కొశాడు. గమనించిన స్థానికులు బాధితున్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్షపాతి అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శనీయమన్నారు. రైతుభరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో మంగళవారం పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ కార్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ లతో పాటు మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతు భరోసా పథకం క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. సన్న వడ్లకు బోనస్ అందిస్తుందన్నారు. ఇటువంటి రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సొసైటీ ఛైర్మెన్లు రావూరి సైదబాబు, తాతా రఘురాం, వివిధ సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, ముజాహీద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, అంజనికుమార్, గజ్జెల్లి వెంకన్న, మద్దినేని రమేష్, కోటేరు నర్సిరెడ్డి, బానాల లక్ష్మ ణ్, వాంకుడోత్ దీపక్ నాయక్, కార్పొరేటర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విజయోత్సవ సంబురాలు

**-ముఖ్యమంత్రి, మంత్రులు రైతులతో ముఖాముఖి**





**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా రైతు వేదికల్లో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. మంగళవారం రఘునాథపాలెం మండల పరిధిలోని రఘునాథపాలెం, వి.వెంకటాయపాలెం, రాంక్యాతండా రైతు వేదికల్లో నిర్వహించిన విజయోత్సవ సంబురాల్లో ఆయా రైతు వేదికల పరిధిలోని రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. విజయోత్సవ సంబురాల్లో ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లా, భూక్యా బాలాజీ నాయక్, రెంట్యాల ప్రసాద్, కిలారు వెంకటరమణ, బానోత్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది రోజుల్లో తొమ్మిదివేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసి రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. రైతు సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకం క్రింద మండల పరిధిలోని 15,845 మంది రైతులకు రూ. 20.40 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఖమ్మం అర్బన్ పరిధిలోని అల్లిపురం రైతు వేదికలో జరిగిన విజయోత్సవ సంబురాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డిసివో గంగాధర్, కార్పొరేటర్ రావూరి కరుణ, వివిపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్ రాపర్తి శరత్, ఏవో కిషోర్, ఆర్ఐ వహీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీతో పాటు తొమ్మిది రోజుల్లోనే తొమ్మిదివేల కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనన్నారు.

# సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయండి

**- సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్**
**- ముమ్మరంగా ఇంటింటా ప్రచారం**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఈనెల 26న పెద్దతండలో నిర్వహించనున్న సిపిఐ పార్టీ 14వ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళ కార్యకర్తలు ఎర్రచీర, కామ్రేడ్స్ ఎర్ర చొక్కాను ధరించి రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, పగిళ్ల వీరభద్రం, గిరిజన సంఘం నాయకులు పాల్తీయ శ్రీను పాల్గొన్నారు.

**ఏదులాపురంలో ఇంటింటి ప్రచారం...**

సిపిఐ మండల మహాసభ విజవంతం కోరుతూ ఏదులాపురంలో ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రించిన కరపత్రాలను అందజేసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, 31వ డివిజన్ కార్యదర్శి దొంతగాని వెంకన్న, సహాయకార్యదర్శి మేళ్లచెర్వు రవి, యువజన సంఘం సభ్యులు మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో...**

కస్నాతండా, పెద్దతండా, తాళ్లేసితండాతో పాటు తదితర ప్రాంతాలలో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మహాసభ విజయవంతం కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తినాయక్, జిల్లా ఉపాధ్యక్షులు పాల్తీయ శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బానోత్ గడ్డ, దేవ, ధరావత్ బద్యా, మాలోతు చందియా, బోడ బాలజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారతీయ స్టేట్ బ్యాంక్ ఖమ్మం రీజియన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌బిఐ బ్యాంక్ 70వ వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా మంగళవారం ఎస్‌బిఐ మమత ఆసుపత్రి రోడ్డు శాఖ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్‌బిఐ ఖమ్మం రీజియన్ మేనేజర్ రాజశేఖర్ ప్రారంభించారు. మొత్తం 123 మంది ఎస్‌బిఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు గిఫ్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరులను ఆదుకోవాలని ఆయన తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్న తలసేమియా, సికిల్ సెల్ సొసైటీకి రక్త ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం మోహన్ నాయక్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఏజిఎస్ షేక్ ఇబ్రహీం, రీజినల్ సెక్రటరీ ఆర్. శివకుమార్, హెచ్ఆర్ మేనేజర్ ఉదయ్, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నందన్, రీజినల్ సెక్రటరీ చిన్నప్పరెడ్డి, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేత



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని మడుపల్లి జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ విద్యార్థులకు ఏకదూప దుస్తులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ వేమిరెడ్డి నాగలక్ష్మీ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయ టం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్, స్కాలర్‌షిప్పులు సద్వినియోగం చేసుకుంటూ మంచి విద్యాభ్యాసాన్ని కొనసాగించి విద్యార్థులంతా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తోట నర్సింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన




**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని మల్లవరం గ్రామం క్లస్టర్ నందు మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎడిఎ ఎస్.విజయ్‌చంద్ర మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం చేయడం వలన భూమి జీవశక్తి పెరుగుతుందని, నీటి నిలువలు, మట్టి నాణ్యత మెరుగుపడుతుందని, ఆరోగ్యవంతమైన ఆహారం లభిస్తుందని, పంటకు మంచి లాభం ఉంటుందని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయానికి జీవ ఎరువు, వర్మీ కంపోస్టు, గోమూత్రం, పుల్లటి మజ్జి, బ్రహ్మాస్త్రం , ద్రవజీవామృతం ఆధారిత శ్రీఘ్ర రకాలు వాడాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.సాయిదీక్షిత్ మాట్లాడుతూ వరి పంట కాకుండా కూరగాయల పంటలను పండించే రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ రఘు, వేణు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగ బలోపేతమే టిఎస్‌యుటిఎఫ్ లక్ష్యం



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రభుత్వ విద్యారంగ బలోపేతమే టిఎస్ యుటిఎఫ్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అన్నారు. టిఎస్‌యుటిఎఫ్ బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి సంఘ సభ్యత్వం, జనరల్ ఫండ్ క్యాంపియన్‌ను మండలంలో మంగళవారం ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ ఘనంగా ప్రారంభించారు. మండలంలోని ముష్టికుంట్ల, చిరునోముల బోనకల్, రావినూతల, గోవిందాపురం, జానకిపురం, బ్రాహ్మణపల్లి, కలకోట, ఆళ్ళపాడు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులందరినీ కలుసుకుని సంఘ సభ్యత్వం, జనరల్ ఫండ్ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి , ఉపాధ్యాయుల సంక్షేమానికి టిఎస్‌యుటిఎఫ్ ఎంతో కృషి చేసిందని, భవిష్యత్‌లో కూడా విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చిన్న రంగారావు, గుగులోతు రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సద్దాబాబు, బాణోతు శారద, మండల కమిటీ సభ్యులు బి.సౌభాగ్య లక్ష్మీ , కోటయ్య, ఎ.నాగేందర్, జి.నిర్మల, డి.వీరన్న, యు.గంగభవాని, బంగారయ్య, .శ్రీనివాసరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం



ప్రజాపక్షం/ మధిర : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా రైతు భరోసాను ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మధిర మార్కెట్‌యార్డు నందు మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహా రావు ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఇందిరమ్మ రాజ్యమని, ఇందిరమ్మ రాజ్యం అంటేనే రైతుల రాజ్యమని మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం రుజువు చేసిందన్నారు. రైతు భరోసా ద్వారా అందుకున్న నిధులను రైతులు పంట పెట్టుబడులకు ఉపయోగించి పంటలు పండించుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రైతుల భరోసా నిధులను ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది రోజుల్లోనే పూర్తి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, నాయకులు దుంపా వెంకటేశ్వరరెడ్డి, తూమాటి నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, షేక్.షన్ను ఆత్మ కమిటీ డైరెక్టర్ అల్లాడి గోపాలరావు, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**-మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియ నాయక్**



ప్రజాపక్షం/కామేపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియ నాయక్ విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ బిఆర్‌ఎస్ పార్టీ ఇచ్చి న పిలుపులో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన కామేపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట బిఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడటంలో, గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రజా సమస్యలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎంపీడీవో జీ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు అంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి, మూడు కృష్ణ ప్రసాద్, కాత్రాల రాంబాబు, ముచ్చర్ల మాజీ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ, పుచ్చకాయల బాబు, మండల పరిధిలోని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఇసుక రవాణాకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం తిరుమలాయపాలెం మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా చేసే యజమానులు కాని, డ్రైవర్లు కాని తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాతనే ఇసుక రవాణా చేయాలని, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. తిరుమలాయపాలెం రైతు వేదికలో ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరమలాయపాలెం మండలంలో మొత్తం 40గ్రామపంచాయతీల పరిధిలో 768 ఇండ్లు మంజూరు అయ్యాయని, మంజూరైన లబ్ధిదారుల వద్ద కొంతమంది ట్రాక్టర్ల యజమానులు ప్రొసీడింగ్ లెటర్ తీసుకుని ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని, ఎవరైనా ప్రొసీడింగ్ లెటర్‌తో ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ట్రాక్టర్‌ని సీజ్ చేయడమే కాకుండా డ్రైవర్, ఓనర్‌పై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. తప్పనిసరిగా సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్ధేశించిన రుసుం చెల్లించి కూపన్ తీసుకుని ఒక కూపన్‌పై ఒక ట్రిప్ మాత్రమే ఇసుక రవాణా చేయాలని, ఒక ఇందిరమ్మ ఇంటికి 12 ట్రిప్పులు ఇసుక అవసరం ఉంటుందని అధికారులు తెలిపినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని ఇసుక రవాణాచేయాలి తప్పా ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రంగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి

**-జీతాల రాక కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన**
**-నానా అవస్థలు పడుతున్న రోగులు, వైద్యులు**









ప్రజాపక్షం/ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో గత ఏడురోజులుగా 259 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న పేషంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్లు, శానిటేషన్ స్వీపర్లకు గత నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో విధులను బహిష్కరించి అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో ఐసియూ, జనరల్‌వార్డులు, మరుగుదోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. రోగులు, బాలింతలు, గర్భిణీలు, వైద్యులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. దీంతో వార్డుల్లో అపరిశుభ్రతతో దుర్గంధం వెదజల్లుతోంది. ఏ వార్డుల్లో చూసిన చెత్తచెదారం దర్శనమిస్తుంది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటికే 57 రకాల వైద్య సేవలు అందుతున్నాయని, కార్మికుల విధులు బహిష్కరించడంతో అన్ని వార్డులో అపరిశుభ్రత దర్శనమిస్తుంది. ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారులు మున్సిపాలిటీ వర్కర్లతో పనులు చేయించడానికి ప్రయత్నించడంతో కాంట్రాక్టు ఉద్యోగులు అడ్డుకోవడం జరుగుతుంది. పోలీసు యంత్రాగం పెద్ద ఎత్తున్న మోహరించి మున్సిపాలిటీ కార్మికులతో పనులు చేయించేందుకు ప్రయత్నం చేయగా కాంట్రాక్టు కార్మికులు, పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్త నెలకొన్నది. ఇప్పటికే సీజనల్ వ్యాధులు మొదలై జిల్లాలోని పలు మండలాల నుంచి రోగులు వైద్యసేవలు పొందేందుకు ప్రధాన ఆసుపత్రికి వస్తుండడం, అపరిశుభ్రత దర్శనమిస్తుండడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఏటువంటి సేవలు అందించేది లేదని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

# నత్తనడకన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు..!

**- అవస్థలు పడుతున్న ప్రజలు**
**- యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్**



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీలో రూ.128కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మున్సిపాల్టీ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన మధిర మున్సిపాల్టీ అభివృద్ధిలో భాగంగా ఇటీవలే రూ.128కోట్లతో అండర్ డ్రైనేజి నిర్మాణ పనులను శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. మధిర మున్సిపాల్టీలోని బంజారాకాలనీ, తదితర వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనుల కోసం తవ్విన గుంటలు ప్రమాదకరంగా మారాయి. నడిరోడ్డుపై గుంతలు తవ్వి 15రోజులు గడుస్తున్నప్పటికీ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఈ క్రమంలో తవ్విన గుంటలు వల్ల తాగునీటి పంపు లైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైనేజిలు మూసుకుపోయి రోడ్లన్ని అధ్వాన్నంగా తయారవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడుతుంది. వర్షాల వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు, ద్విచక్ర వాహనదారులు జారి పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంటలు తవ్విన కాంట్రాక్టర్ పనులను తీవ్ర జాప్యం చేస్తుండటంతో ఇండ్లలో నుండి బయటకు రావడానికి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ డ్రైనేజి పనుల్లో భాగంగా పెద్ద పెద్ద గుంటలు తీసి పెద్ద ఎత్తున కుప్పలు పోయడం వలన ఇండ్లల్లో నుండి ప్రజలు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది.తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు పగిలిపోవటంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం వర్షాలు పడుతుండటంతో పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు చేరి అవి కన్పించకుండా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపాల్టీ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**-సీడీపీవో రేవతి, ఎస్ఐ నాగ బిక్షం**





ప్రజాపక్షం/బూర్గంపాడు : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువులు చదివి సమాజంలో ఆదర్శంగా నిలవాలని సీడీపీవో రేవతి, ఎస్ఐ నాగబిక్షంలు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బూర్గంపాడు మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ కోఆర్డినేటర్ రవి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎవరైనా చాక్లెట్ రూపంలో నైనా ఇంకా ఏదైనా పదార్థాన్ని అపరిచిత వ్యక్తులు అందించినప్పుడు వాటిని తీసుకోవద్దని సూచించారు. తక్షణమే మీ ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే చెడు వ్యసనాలకు మీ తోటి మిత్రులు ఎవరైనా లోనైనా వారిని గుర్తించి మీ ఉపాధ్యాయులచే వారి తల్లిదండ్రులచే కౌన్సిలింగ్ ఇప్పించి మీతో పాటు మంచిగా చదివే విధంగా చూడాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించవచ్చు అని తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హానికర ప్రభావాలతో పాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తింపు గౌరవం ఉండదని సూచించారు. ఈ డ్రగ్స్ నిర్మూలన కొరకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. మండలంలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే వెంటనే పోలీసులు వారికి సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో మహిళా శక్తి కోఆర్డినేటర్ రూప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నాటికి భూ భారతి సమస్యలు పరిష్కరిస్తాం

**-వీసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్**





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆగస్టు 15 నాటికి భూ భారతికి చెందిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్‌కే రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో కలెక్టర్ పలు అంశాలపై సమాధానాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనమహోత్సవలో భాగంగా 70 లక్షల మంక్కలను నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ డి వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, జిల్లావైద్యాధికారి భాస్కర్‌నాయక్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కిషోర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు అంతా కలిసిరావాలి

**- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్‌పి**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మాదక ద్రవ్యాల నిరోదానికి ప్రతీ ఒక్కరూ కలిసికట్టుగా నడుంబిగించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. మాదకద్రవ్యాల నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్‌పి రోహిత్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాల సాధనకై కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన అనేక ఆరోగ్య సమస్యలను తీసుకొస్తాయని చెప్పారు. ఈ వారోత్సవాల సందర్భంగా నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి మల్లయ్య స్వామి, సిఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, 1వ టౌన్ సిఐ కరుణాకర్, ఐటి సెల్ ఇన్స్‌పెక్టర్ రాము, జూలూరుపాడు సిఐ ఇంద్రసేనా రెడ్డి, అశ్వారావుపేట సిఐ నాగరాజురెడ్డి, ఆర్‌ఐలు నర్సింహారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంప్రదాయాలను కాపాడటం అభినందనీయం

**- మోటా ప్రత్యేకాధికారి సుభాష్**





ప్రజాపక్షం/భద్రాచలం : పూర్వం నుండి వస్తున్న గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడేందుకు గిరిజన మ్యూజియంను తయారు చేయడం అభినందనీయమని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ న్యూఢిల్లీ(మోటా) ప్రత్యేకాధికారి సుభాష్ అన్నారు. సుభాష్ భద్రాచలం డివిజన్లో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని ఆయన సందర్శించి మ్యూజియంలోని కళాఖండాలను, చిత్రాలు, ట్రైబల్ వంటకాలను ఆయన తనివితీరా ఆస్వాదించారు. ఈసందర్భంగా సుభాష్ మాట్లాడుతూ పర్యాటకులకు కనువిందు కలిగించే విధంగా ట్రైబల్ మ్యూజియాన్ని రూపొందించి పాత తరం గిరిజనుల ఉవాడుకునే వస్తువులు, ధరించే ఆభరణాలు ఒకే వేదిక వద్దకు చేర్చడం బాగుందన్నారు. మ్యూజియంలోని ప్రతీది సహజత్వం ఉట్టిపడేలా ఉందని అభినందించారు. రెండు రోజుల పర్యటనలో దేవాలయాలతో పాటు మ్యూజియంను కూడా సందర్శించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు సక్రమంగా అందుతున్నాయని, ఇందుకు సిబ్బంది పనితీరు భేషన్నారు. అనంతరం పిఓ రాహుల్‌ను తన ఛాంబర్లో కలిసి గిరిజనలుకు అందుతున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా మోటా ప్రత్యేకాధికారిని పిఓ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, జేడిఎం హరికృష్ణ పాల్గొన్నారు.

# కమర్షియల్‌గా సాగుతున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దందా..!

**-హోటల్స్, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో దర్శనమిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు**
**-సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు శూన్యం**



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు, అశ్వాపురం, పినపాక లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దందా కమర్షియల్‌గా సాగుతోంది. గృహావసరాలకు వినియోగించే డొమెస్టిక్ సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి. ఈ వ్యాపారం ప్రధానంగా అశ్వాపురం, మణుగూరు తో పాటు పినపాక, మండల కేంద్రాల్లో కూడా జోరుగా నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా హూటళ్లలో, ఫాస్‌ఫుడ్, టిఫిన్ సెంటర్, బేకరిలలో ఇంటిలో వాడాల్సిన సిలిండర్లను దొంగచాటున వినియోగిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండంతో పాటు కొంత మంది ఏజెన్సీదారులకు తెరచాటున ఇదొక వ్యాపారంగా మారిపోయింది. అయితే డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా నిరంతరంగా తనిఖీలు చేయాల్సిన సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇటీవల కాలంలో తనిఖీలు చేయడం మానేశారు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. హూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర వ్యాపారాలకు కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వ నిబంధనలున్నాయి. అయితే చాలా మటుకు ఆ నిబంధనలను పాటించడం లేదు. దీంతో హూటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్, కేంద్రాల నిర్వాహకులు ఇది తప్పని తెలిసినా డొమెస్టిక్ గ్యాస్ ను వినియోగించడానికి అక్రమ మార్గాన్ని ఆచరిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలను మచ్చిక చేసుకుని డొమెస్టిక్ సిలిండర్లను సబ్సిడీ లేకుండా కొనుగోలు చేస్తున్నారు. ఇటు గ్యాస్ ఏజెన్సీలకు కూడా ఒక్కో సిలిండర్ పై లాభం రావడంతో ఈ దందా జోరుగా కొనసాగుతోంది. మణుగూరు, అశ్వాపురం, మండలంలో జరుగుతున్న ఈ గ్యాస్ దందా పై సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేక వాళ్లు ఇచ్చే ముడుపులకు తలవంచుతారో వేచిచూడాలి.

# నవోదయలో సీటు సాధించిన బ్రిలియంట్ విద్యార్థి



ప్రజాపక్షం/బూర్గంపాడు: జవహర్ నవోదయ వారు ప్రకటించిన ఫేజ్ 2 నవోదయ ఫలితాలలో సారపాక బ్రిలియంట్ స్కూల్‌లో చదువుతున్నటువంటి బి కార్తికేయ సీటు సాధించడం పట్ల బ్రిలియంట్ నవోదయ కోచింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఎన్‌ఆర్ అభినందనలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి సంవత్సరం నవోదయలో సీట్లు సాధిస్తూ ఎందరో విద్యార్థులను జాతీయ స్థాయిలో నిలుపుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రయత్నిస్తే ప్రతి విద్యార్థి ప్రతిభావంతుడే అనడానికి బ్రిటియంట్ నవోదయ కోచింగ్ విద్యార్థులే ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఈనెల 28 నుండి నవోదయకు కోచింగ్ ఇవ్వనున్నట్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించు కోవాల్సిందిగా కోరారు.

# పబ్లిక్ టాయిలెట్స్ మంజూరు చేయాలి



ప్రజాపక్షం/కరకగూడెం: మండల కేంద్రంలోని ప్రయాణికులకు, వాహనదారులకు, ప్రజలకు మూత్ర విసర్జన లేక ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే పబ్లిక్ టాయిలెట్స్ మంజూరు చేయాలని కరకగూడెం ఆటో యూనియన్ సభ్యులు యలగొండ శ్రీను అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నందు ఆటో యూనియన్ సభ్యులతో కలిసి కరకగూడెం మండల ఎంపీడీవో దేవవరకుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఎంపీడీవో సానుకూలంగా స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమరం సాంబశివరావు, గుడ్ల రంజిత్, ఇలియాజ్, కొమరం శ్రీకాంత్, ముత్యాల మధు, సిద్ధి వినయ్, సతీష్, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను సందర్శించిన ఏసీఎంవో



ప్రజాపక్షం/చంద్రుగొండ: ఏహెచ్‌ఎస్ పాల్వంచ కాంప్లెక్స్ పరిధిలోని జీపీఎస్ తిప్పనపల్లి తండా, జీపీఎస్ బాలికుంట పాఠశాలలను ఏసీఎంవో కేసరి రమేష్ సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా పిల్లల యొక్క సామర్థ్యాలను(తెలుగు, ఇంగ్లీష్, గణితం) పరిశీలించారు. గత సంవత్సరం యొక్క ఉద్దీపకం రిజల్ట్ షీట్ పరిశీలించారు. అలాగే జీపీఎస్ పిల్లలకు ఐటిడిఏ పీవో అందించిన నోట్ బుక్స్, ఆయన చేతుల మీదుగా అందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులకు ఉద్దీపకం పుస్తకంలోని అంశాలను పిల్లలకు ఏ విధంగా బోధన చేయాలో వివరించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తగు సూచనలు చేశారు. పాఠవాలకు కావాలసిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం ఐ వీరన్న, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు

ప్రజాపక్షం/కరకగూడెం: మణుగూరు మం డల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రైవేటు విద్యా సంస్థ ల దోపిడీ పై ఒక పత్రికా ప్రకటనలో తెలియ జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ను వ్యాపార ధోరణితో యజమాన్యాలు వ్యవహరిస్తుండటంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని, ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువుకే ఖర్చువుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థ ల్లో చదివించాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని, విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూళ్లు చేస్తున్నారని. తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని అన్నారు. పాఠశాలల్లో ఫీజులకు తోడు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నోట్ బుక్స్, బస్సు ఫీజు లంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభా గం భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్, యూత్ కార్యదర్శి గోగు సాయి, ములుగు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బాడిస సువాస్, వంశి, దినేష్ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వాడకం అరికట్టాలి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు వాడడం వల్ల జరిగే నష్టాలపై మంళవారం మధిర రూ రల్ సిఐ మధు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం ఎస్సై రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలను మూసేయాలి

- నారాయణ విద్యాసంస్థ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆందోళన
- స్టేషనరీ రూం సీజ్ చేసిన ఎంఇఓ
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కె పహీంఖాన్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న నారాయణ విద్యాసంస్థలను మూసేయాలని, నిబంధనలకు విర్ధుదంగా స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే పహీం ఖాన్ అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అక్రమాలపై ఫోన్‌లో జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేయగా అక్కడి చేరుకున్న డిఇఓ వెంకటేశ్వరాచారి పాఠశాలలో విక్రయానికి సిద్దంగా ఉంచిన యూనిఫాం, బుక్స్, ఇతర స్టేషనరీ ఉంచిన గదికి తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా పహీంఖాన్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కి అధిక ఫీజులు గుంజుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేటు కార్పోరేట్ విద్యా సంస్థలు నిలువుగా దోచుకుంటున్నాయన్నారు. విద్యార్థులను వసూళ్లు చేసే ఫీజుల వివరాలు ప్రదర్శించాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికాలంగులైన పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలని, పేద వర్గాల వారికి ఫీజు రాయితీ ఇవ్వాలని, జీనెం 42/2010 చట్టం ప్రకారం డొనేషన్లు, క్యాప్టేషన్ ఫీజులు వసూళ్లు చేయరాదని, ఆట స్థలాలు తప్పని సరిగా ఉండాలని అన్నారు. జిల్లాలో కార్పోరేట్ విద్యాసంస్థలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారుల తమకు ఏమీ పట్టనట్లుగా వ్యహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ కన్నుసన్నల్లోనే ఇంతా జరుగుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ, అక్రమ విక్రయాలు సాగిస్తున్న కార్పోరేట్ విద్యా సంస్థలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అలాంటి పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్, జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సృజన, ఇనపల్లి పవన్‌సాయి, నాయకులు అక్కినాపల్లి నాగేంద్రబాబు, వినయ్, వంశీ, మహేష్, కళ్యాణ్, ప్రదీప్ పాల్గొన్నారు.

# అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

-ఏఐఎస్ఎఫ్ ఆందోళనతో దిగి వచ్చిన అధికారులు

-నారాయణ విద్యాసంస్థల బుక్స్, యూనిఫామ్ గోడౌన్స్ సీజ్







**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విద్యను వ్యాపారంగా మార్చి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో రెండు రోజులుగా నారాయణ విద్యాసంస్థల అధిక ఫీజులు తగ్గించాలని ఆందోళన నిర్వహించగా, అధికారులు దిగివచ్చి నారాయణ విద్యాసంస్థలపై సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గోడౌన్స్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు పేరుతో వసూలు దందా కొనసాగిస్తున్నారన్నారు. విద్యను అంగడి సరుకుగా మార్చేసి అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లు, బుక్స్‌కు సపరేటు, యూనిఫామ్ కు సపరేట్ అని, ఐఐటి ఫౌండేషన్ కు వేరే ఫీజు అని, ఇలా రకరకాల కోర్సులు బ్రోచర్స్ తో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తుందే తప్ప, ఫీజులు నియంత్రించడంలో వైఫల్యం చెందిందన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్యహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని, విద్య హక్కు చట్టం ప్రకారం విద్యకు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ,వికలాంగులు పేదల వర్గాల విద్యార్థులకు 25% పీజి రాయితీ ఇవ్వాలని, ఇది ఏ కోశానా అమలు జరగడం లేదన్నారు. జీవో నెంబర్ 42, 2010 ప్రకారం డొనేషన్లు, క్యాప్టేషన్ ఫీజులు వసూలు చేయరాదని, ఆట స్థలం తప్పనిసరిగా మున్సిపాలిటీ పరిధిలో 1000 చదరపు మీటర్లు ఉండాలన్న నిబంధనలు ఉన్నా, ఆ నిబంధన తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ మాత్రం నిమ్మకు నిరత్తినట్టుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నారాయణ విద్యాసంస్థలు ఒక ఇల్లును తీసుకొని అందులో బుక్స్ యూనిఫామ్ స్పోర్ట్స్, డ్రెస్సులు, షూస్ ఇంకా కొన్ని రకాల వస్తువులను గోడౌన్స్ లో పెట్టి లక్షల రూపాయల దందాను నడుపుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులకు మాత్రం అంటి అంటనట్టుగా వ్యవహరించడం చాలా బాధాకరం అన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థిఫెడరేషన్ ఖమ్మం జిల్లా సమితి తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ నాయక్, వంశీ, మనోజు, ఏఐఎస్ఎఫ్ సత్తుపల్లి పట్టణ నాయకులు అన్నవరపు ఉపేంద్ర, రామకృష్ణ, దేవేందర్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మెప్మాలో వంద రోజుల కార్యాచరణపై కమిషనర్ సమీక్ష



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కమీషనర్ నరసింహ మెప్మా సిబ్బంది, ఆయా వార్డుల్లోని రీసోర్స్ పర్సన్స్ తో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ఋణాలకు సంబంధించి పట్టణంలో 62 స్వయం సహాయక సంఘాలకు రూ.10 కోట్ల 56 లక్షలు లక్ష్యం విధించగా, 24 స్వయం సహాయక సంఘలకు రూ.3 కోట్ల, 86 లక్షలను మంజూరు చేయటం జరిగినట్లు తెలిపారు. అదే విధంగా కొత్త సంఘాల ఏర్పాటు, వీధి వ్యాపారుల సంఘాల ఏర్పాటు, బ్యాంక్ రుణాలు ఇప్పించుట, స్వయం సహాయక సంఘాల సభ్యులకు తడి,పొడి చెత్త వేరుచేసే ప్రక్రియపై 6 వార్డులలో అవగాహన కల్పించారు. ఈ సమీక్ష సమావేశంలో మెప్మా విభాగపు సి. ఓ. లు, 23 వార్డుల రిసోర్సు పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులు వద్దు..ఆదివాసీల అభివృద్ధే ముద్దు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మావోయిస్టులు వద్దు...ఆదివాసీల అభివృద్ధే ముద్దు అని ఆదివాసీ గుడాలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే సమాచారం అందించి తగిన పారితోషికం పొందవచ్చునని టేందవచ్చునని సిఐ సురేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ఆదివాసీ గ్రామాలు రాఘవాపురం గుత్తికోయ గుంపు, సుద్దరేవులలో క్యాసో నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చత్తీష్‌ఘడ్ రాష్ట్రంలో వరుస ఎన్కౌంటర్లు, అరెస్టులతో తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టు సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి ఆదివాసీ నివాస ప్రాంతాలను ఆధారంగా చేసుకుని సంచరిస్తున్నట్లు నమ్మకమైన గట్టి ఆధారాలు లభిస్తున్నాయని, కావున మావోయిస్టు దళ సభ్యులు లేదా అనుమానితులు అపరిచిత వ్యక్తులు ఎవరైనా మీ ఆదివాసీ గుంపుల దగ్గరలో సంచరించినట్లయితే వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి తగిన పారితోషకం పొందండి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్‌ఐ ఎం సోమేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు చేసిందని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల కోసం జిమ్ముకులు చేస్తున్నారని విమర్శించారు. మాయమాటలో ప్రజలను, రైతులను మోసం చేసేందుకు కొత్తఎత్తుగడ వేశారన్నారు. గత ముఖ్యమంత్రి కేసిఆర్ 11 సార్లు రైతుబంధు పథకాన్ని రూ.80 వేల కోట్లు ఇచ్చారని చెప్పారు. కరోనా సమయంలో కూడా ఎంఎల్‌ఏల జీతాలు సైతం ప్రక్కకు పెట్టి ప్రజల శ్రేయస్సు కోసం, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం రైతు బంధు వేశారని చెప్పారు. రైతులకు బేడీలు వేసినందుకా, సన్నాలకు బోనస్ ఎగనామం పెట్టినందుకా, గత రెండు సార్లు రైతు బరోసా ఎగనామం పెట్టినందుకా, రైతుకు రూ.15000 ఇస్తామని,రూ.12000 ఇచ్చినందుకా, రైతుబీమా పథకాన్ని పూర్తిగా ఎత్తివేసినందుకా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవ సంబురాలు చేసుకునేదిని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి రైతులకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని మానె డిమాండ్ చేశారు.

# ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సోసైటీ ఆధ్వర్యంలో నూతనంగా నేలకొండపల్లి మండల కేంద్రం లో ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతి రావు పేర్కొన్నారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితుల కారణంగా రెగ్యూలర్ గా పాఠశాలలో చేరని వారికీ, చేరి మధ్యలో మానేసిన వారికి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ తమ యెక్క విద్యార్హతల పెంచుకునేందుకు పదో తరగతి లో ప్రవేశం పొందుటకు అవకాశం కల్పించిందని అన్నారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల లో కేంద్రం ను ప్రారంభించినట్లు తెలిపారు. 31 0825 . నాటికి 14 సంవత్సరాలు వయుస్సు నిండిన వారు ఓపెన్ స్కూల్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశం ను వినియోగించుకోవాలని సూచించారు. అడ్మిషన్ జనరల్ వారికి రూ.1550, ఇతరలకు రూ.1150 లు చెల్లించాలని సూచించారు. వచ్చే నెల 12 నుంచి ఆగస్టు 12 వరకు అవకాశం ఉందని తెలిపారు.

# ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన అర్షియా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం) ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో స్థానిక విశ్వశాంతి విద్యాలయం విద్యార్థిని ఎండి. అర్షియా సీట్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి అర్షియాతో పాటు ఆమె తల్లి రాబియాను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అర్షియా మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో తాను 569 మార్కులు సాధించినట్లు తెలిపారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు గత మూడు సంవత్సరాలుగా వరుసగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం ద్వారా హ్యాట్రిక్ చేశారని పేర్కొన్నారు

# ప్రజా ప్రభుత్వంలో వ్యవసాయం దండుగ కాదు పండుగ



**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వ్యవసాయం దండుగ కాదు పండుగ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాలి దుర్గారావు అన్నారు. రైతు భరోసా విజయోత్సవ సంబరాల్లో భాగంగా మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నా టి రామ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం 18 నెలల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ అందించిన ఏకైక ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, పాసంగలపాటి కోటేశ్వరరావు, ఆదిలక్ష్మి , శ్రీను, పుల్లయ్య, ఆంతోటి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్ర పటాలకు చింతగుర్తి గ్రామంలో పాలాభిషేకం నిర్వహించారు. మంగళవారం ఏఎంసి డైరెక్టర్ తమ్మిని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో ముఖ్యమంత్రి, మంత్రుల చిత్ర పటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మిని నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు. రూ. 21వేల కోట్ల రుణమాఫీ చేయడంతో పాటు తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా వానాకాలం పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. రైతు సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ అమలు చేయనివిధంగా పలు పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త కొమరయ్య, కేతినేని సీతారాములు, ఆలస్యం శ్రీనివాసరావు, ఆలస్యం సూరయ్య, సూదగాని గోపయ్య, సీతారాములు, అద్దంకి ముత్తయ్య, పేరపాక భిక్షం, సురభి కొండల్, కూరపాడు వెంకటేశ్వరరావు, మాలోత్ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.




# అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు

## -దాడి చేసి పట్టుకున్న వైద్య శాఖాధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని వైద్య ఆరోగ్యశాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్న సంఘటన ఖమ్మం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్డులో అన్నవరపు అంజిరెడ్డి అనే వ్యక్తి ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తూ తన ఇంట్లో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడన్న సమాచారంతో వైద్యశాఖ, టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అంజిరెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా లింగ నిర్ధారణ పరీక్షకు ఉపయోగించే స్కానింగ్ మిషన్‌ను గుర్తించినట్లు తెలిపారు. అంజిరెడ్డితో పాటు స్కానింగ్ మిషన్‌ను సీజ్ చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అనుమతులు లేకుండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి వాటికి పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సైదులు, టాస్క్‌ఫోర్స్ ఏసిపి రవి, త్రీటౌన్ సిఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెద్ బిన్ హుందాన్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలో పర్యటించి ఉర్దూఘర్ షాదీఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలోని ఉన్న షాదీఖానా మరమ్మతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల సారధ్యంలో రాష్ట్రంలోని అన్ని ఉర్దూఘర్ షాదీఖానాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఖమ్మం నగరంలోని షాదీఖానాకు మైనార్టీ సంక్షేమం ద్వారా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసి మైనార్టీల కొరకు దీనిని ఉపయోగించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ, ఎస్‌కె ఇస్మాయిల్, పి. హతావుల్లా, రజబ్‌అలీ, అర్బన్ తహసీల్దార్ సైదులు, మైనార్టీ సంక్షేమ అధికారి పురందర్, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.



## కారుణ్య నియామకాలకు ముఖాముఖి కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మంగళవారం కొత్తగూడెం ఏరియా జి.యం. ఎం. షాలేం రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు పద్మావతి ఖని మైన్ నందు విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన మరణించిన ఉద్యోగుల వారసులు తొమ్మిది మందికి పద్మావతి ఖని ఏజెంట్ కార్యాలయంలో ముఖాముఖీ కౌన్సిలింగ్ వారి కుటుంబ సభ్యుల సాక్షుల సమక్షంలో నిర్వహించి అన్నివివరాలు నమోదు చేసి కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి కంపెనీ నియమ నిబంధనలు అనుసరించి వారికి నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని మైన్ ఏజెంట్ బి.రవీందర్, డి.జి.యం. పర్సనల్ గామలపాటి వెంకట మోహన్ రావు, మైన్ మేనేజర్ ఎం.వి.ఎన్ శ్యాం ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మజ్జి మురళి, మైన్ సంక్షేమ అధికారి షేక్ షకీల్, సంబంధిత క్లర్క్ కొత్తపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులు ప్రారంభం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి వ్యాప్తముగా గల ఎస్‌పిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల లో భాగముగా సోమవారం నుండి 27 వరకు కొత్తగూడెం ఎస్ పిసి ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించే 50వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఏరియా సెక్యూరిటీ అధికారి ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ హాజరై ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భముగా ఏరియా సెక్యూరిటీ అధికారి ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ. సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమ శిక్షణ అనేది ముఖ్యం అని, మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని, ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితం లోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని, ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా, మెయిన్ గేటు వద్ద, చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుంది అని, యస్ పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, యస్ పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుంది అని, కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్ యస్.ఐ యస్.కె.మదార్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన జిల్లా అటవీ అధికారి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనుదీప్ దురిశెట్టిని జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రంసింగ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా రైతు భరోసా పండుగ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను గత సోమవారం నుంచి రైతుల అకౌంట్ లో జమ చేయటం జరుగుతన్న నేపథ్యంలో మంగళవారం పెనుబల్లి మండలం, ఏరుగట్ల గ్రామం లో గల రైతు వేదిక వద్ద సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. మట్టా దయానంద్‌కి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావు లకు పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీముల్లా ఆధ్వర్యంలో ఏరుగట్ల, రామచంద్రపురం గ్రామ రైతులు అందరు కలిసి హర్షం వ్యక్తం చేస్తూ వారికి పాలాభిషేకం చేసి సంతోషం లో స్వీట్ పంచుకోవటం జరిగింది. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులు సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కి, తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌కి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో రెండు గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే మండలం లోని అన్ని రైతు వేదికల్లో రైతు భరోసా సంబరాలు జరిగాయి.

# రైతు విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్



**ప్రజాపక్షం/ కూసుమంచి :** హైదరాబాద్‌లో జరిగిన రైతు విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కూసుమంచి రైతు వేదిక నుంచి పాల్గొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు విజయోత్సవ సభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు ఇతర మంత్రులు, సిఎస్ కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ విజయోత్సవ సభకు కూసుమంచి రైతు వేదిక నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రైతుల సంక్షేమం కోసం రూ. 1.04 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. రుణమాఫీతో పాటు రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత, మండల వ్యవసాయ అధికారిణి అనురాధ, ఏఈవోలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో ఒకే ఒక్కడు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రైతు భరోసా సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ముఖ్యమంత్రి, మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు కొందరికి మంత్రులతో మాట్లాడే అవకాశం కూడా వచ్చింది. కానీ ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలు రైతు వేదికకు ఒకే ఒక రైతు హాజరు కావడం విస్మయం కలిగించింది. ఇక్కడి అధికారులు ఏమయ్యారో కానీ ప్రముఖ సేంద్రీయ రైతు కుడుముల వెంకట్రామిరెడ్డి మాత్రమే హాజరయ్యారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు రైతువేదిక వద్దకు వచ్చి ముఖ్యమంత్రి, మంత్రుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కొద్దిసేపు హడావుడి చేశారు. తీరా ముఖ్యమంత్రి కార్యక్రమం ప్రారంభమయ్యే సమయానికి వెంకట్రామిరెడ్డి మినహా ఒక్కరూ కూడా లేకపోవడం గమనార్హం. ఈ రైతువేదిక పరిధిలో మీనవోలు, తక్కెళ్లపాడు, పెగళ్లపాడు గ్రామాలు ఉన్నాయి. మూడు గ్రామాలకు సంబంధించిన రైతులు ఎవరు పాల్గొనకపోవడం విశేషం. సకినవీడుకు చెందిన చావా రామకృష్ణ అనే రైతు హాజరై ఒక్కరు మినహా ఎవరు లేకపోవడంతో వెనుదిరిగారు.



తల్లాడ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు విజయోత్సవ కార్యక్రమంలో ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఏవో, ఏఈవోలు, పంచాయతీ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.